క్లుప్తంగా

దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మంఅర్బన్: నగరంలోని రాపర్తినగర్ టీఎన్జీవోస్ కాలనీలో ఉన్న తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల బాలికల కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబిదాసల్మా ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ బీఈడీ ఇంగ్లిష్ సబ్జెక్టులో 50శాతం మార్కులు ఉండి 18–44 ఏళ్లు ఉన్న మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 26వ తేదీ కల్లా ఇవ్వాలని సూచించారు.వివరాలకు 7331170880 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

27న వాహనాల వేలం

ఖమ్మంక్రైం: జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులకు పట్టుపడిన 10 వాహనాలకు ఈనెల 27న వేలం వేయనున్నట్లు ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1 సీఐ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. గట్టయ్య సెంటర్ ప్రాంతంలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్–1లో ఈ వేలంపాట ఉదయం 11 గంటలకు ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

జాఫర్ బావి సుందరీకరణకు రూ.36 లక్షలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖిల్లాలోని జాఫర్ బావిని శుభ్రం చేసే పనులు పూర్తవడంతో సుందరీకరణ పనులపై అధికారులు దృష్టి సారించారు. రూ.36 లక్షలతో బావిని ఆధునీకరించి చుట్టూ రెయిలింగ్, లైటింగ్ ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలవనున్నారు.

తాళ్లగూడెంలో విద్యుత్ అదాలత్

కామేపల్లి(కారేపల్లి): మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామంలో కొత్తలింగాల విద్యుత్ శాఖ ఆధ్వర్యాన శుక్రవారం విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకొని, దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లకావత్ సునీత, ఏఈ ఎస్.శ్రీనివాసులు, శామ్యూల్ రాజ్, రాజసింహా తదితరులు పాల్గొన్నారు.

పిండిప్రోలు కళాశాలను పరిశీలించిన జడ్జి

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ జావేద్‌పాషా శుక్రవారం పరిశీలించారు. హైకోర్టు ఆదేశాల మేరకు కళాశాలలో టాయ్‌లెట్ల సౌకర్యాన్ని పరిశీలించిన ఆయనకు సుమారు 400 మంది విద్యార్థులకు టాయ్‌లెట్లు సరిపోవడం లేదని ఉద్యోగులు తెలిపారు. ఆతర్వాత కళాశాల ఆవరణలో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యంపై జడ్జి ఆరా తీశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణాలివ్వాలి..

నేలకొండపల్లి: వందల ఎకరాలు ఉన్న బడా రైతులకు ఇచ్చే రైతుబంధు పథకానికి లేని ఆంక్షలు పేదల ఇళ్లు, రుణాలకు మాత్రం ఎందుకని కాంగ్రెస్ బీసీ సెల్ పాలేరు డివిజన్ అధ్యక్షుడు జెర్రిపోతుల సత్యనారాయణ ప్రశ్నించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం బీసీ రుణాలపై విధించిన ఆంక్షలను ఎత్తివేసి నిరుపేదలందరికీ రుణాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు.

'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

ఖమ్మంరూరల్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26న సమస్యల సాధనకై జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి నండ్ర.ప్రసాద్, నాయకులు వి.నాగేశ్వరరావు, టి.వెంకట్రావు, పి.సత్యనారాయణ, పి.సంగయ్య, రామయ్య, టి.నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవడంలో విఫలం

తిరుమలాయపాలెం: తెలంగాణ కోసం ఉద్యమాలలో పోరాడిన వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు జూలకంటి సాగర్‌రెడ్డి ఆరోపించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన సుబ్లేడు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు నవీన్‌ను శుక్రవారం ఆయన పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయమందించాక మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం నవీన్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, ఉపేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఆదిపురుష్
వినోద	అశ్విన్స్
సాయిరాం	భీమదేవరపల్లి బ్రాంచి, కర్ణ
ఆదిత్య	మను చరిత్ర
శ్రీనివాస	1920

- ఖమ్మంగాంధీచౌక్

తీరిన నీటి కష్టాలు!

నగరంలో ఇక నుంచి మస్తుగా నీళ్లు..

- 18 ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం
- 60 డివిజన్లలో 985 కిలోమీటర్ల మేర పైపులైన్లు
- రోజుకు 70 మిలియన్ లీటర్ల నీటి సరఫరా
- రోజూ నీళ్లొచ్చేలా ముందస్తు ప్రణాళికలు

ఖమ్మంమయూరిసెంటర్: ఒకప్పుడు రెండు, మూడు రోజులకోసారి మంచినీళ్లు వచ్చేవి. నీళ్లొచ్చిన సమయాన నగర ప్రజలు బిందెలతో రోడ్లెక్కి వాటర్ ట్యాంకర్ల వద్ద నానా అవస్థలు పడేవారు. రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంలో భాగంగా అమృత్ స్కీం ద్వారా ఖమ్మం మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌లు, పైపులైన్ల నిర్మాణం చేపట్టడంతో నగరంలో మంచినీటి సమస్యకు చెక్ పెట్టినట్లయింది. అంతేకాక ప్రజావసరాలకు అనుగుణంగా అధికారులు మంచినీటి సరఫరా సమయాలను మార్పు చేసి, రోజు విడిచి రోజు ఉదయం 70 మిలియన్ లీటర్ల నీటిని నగర ప్రజలకు అందిస్తున్నారు. ఇందులో జీళ్లచెరువు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 30 మిలియన్ లీటర్లు, నగరంలోని ఫిల్టరేషన్ బెడ్ల నుంచి 40 మిలియన్ లీటర్లు నీరు సరఫరా అవుతుంది.

18 ట్యాంక్‌ల నిర్మాణం..

ఖమ్మం కార్పొరేషన్‌గా మారిన తర్వాత, పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకుని నగరంలో నూతన ట్యాంక్‌లు, పైపులైన్లు నిర్మించడంతో పాటు నల్లా కనెక్షన్లు పెంచారు. ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకం ద్వారా కేఎంసీలో కొత్త ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, పైపులైన్ల నిర్మాణం చేపట్టారు. గతంలో 7 ట్యాంక్‌ల ద్వారానే నీటిని సరఫరా చేయాల్సి ఉండడం, పైపులైన్లు సక్రమంగా లేక రెండు మూడు రోజులకోసారి నీటిని సరఫరా చేసేవారు. కానీ ఇప్పుడు నగరంలో 300 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే సామర్థ్యం కలిగిన 18 ట్యాంక్‌లను నిర్మించగా.. 10 ట్యాంక్‌లను ప్రారంభించారు. అంతేకాక నగరంలో ఉన్న 225 కిలోమీటర్ల పైపులైన్లను 985 కిలోమీటర్లకు పెంచారు. దీంతో అన్ని డివిజన్లలో ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్లు ఇచ్చేందుకు వీలు ఏర్పడింది. గతంలో 27 వేల నల్లా కనెక్షన్లు ఉండగా.. ఇప్పుడు 77 వేలకు పెరిగింది.

ప్రతి రోజూ నీళ్లొచ్చేలా ప్రణాళికలు..

గతంలో మంచినీళ్లు రెండు, మూడు రోజులకోసారి వస్తుండడంతో నగర ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. కానీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రత్యేకంగా రోజు విడిచి రోజు మంచినీరు సరఫరా అయ్యేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో నగరంలో మరో 190 కిలోమీటర్ల మేర పైపులైన్ల నిర్మాణం, 18 వేల కొత్త నల్లా కనెక్షన్లు, దానవాయిగూడెంలో 25 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఫిల్టరేషన్ ప్లాంట్ నిర్మాణం అవసరమని మంత్రికి అధికారులు నివేదికలు పంపించారు. వీటి నిర్మాణం పూర్తయితే నగరంలో ప్రతి రోజు మంచినీటిని సరఫరా చేసేందుకు వీలుంటుంది.



సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీరు

ఎనిమిది డివిజన్లకు 'బాహుబలి' ..



త్రీటౌన్ ప్రాంతంలో గుట్టలబజార్ గుట్టపై నిర్మించిన బాహుబలి మంచినీటి ట్యాంక్

నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో గుట్టల బజార్‌లోని గుట్టపై ఉన్న పాత ఓవర్‌హెడ్ ట్యాంక్ మరమ్మతులకు గురికావడంతో అక్కడ అధికారులు 23 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యంతో ఓ ట్యాంక్‌ను నిర్మించారు. ఇది హైదరాబాద్ గ్రేటర్ మున్సిపాలిటీలో నిర్మించిన అతి పెద్ద ట్యాంక్‌ల తరహాలో ఖమ్మంలోనూ నిర్మించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక ఈ ట్యాంక్‌కు జీళ్లచెరువు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఎలాంటి పంపింగ్ లేకుండా గ్రావిటీ ద్వారా నేరుగా నీటిని ఎక్కిస్తున్నారు. త్రీటౌన్ ప్రాంతంలోని ఎనిమిది డివిజన్లకు ఈ ట్యాంక్ ఒక్కటే మంచినీటిని సరఫరా అందిస్తుండడంతో దీనికి బాహుబలి ట్యాంక్‌గా పేరొచ్చింది.

నీటి సమస్యను అధిగమించాం..



నగరంలో ఒకప్పుడు మహిళలు మంచినీటి కోసం బిందెలతో రోడ్లపైకి వచ్చేవారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక మిషన్ భగీరథ ద్వారా చేపట్టిన పనులతో నేడు ఆ సమస్య లేదు. ముందస్తు ప్రణాళికలతో మంచి నీటి సరఫరా చేస్తూ సమస్యను అధిగమించాం.

– పునుకొల్లు నీరజ, మేయర్, కేఎంసీ

కొత్త కనెక్షన్లు ఇస్తాం..



నగరంలో నల్లా కనెక్షన్ కావాల్సిన వారందరికీ ఇచ్చాం. ఇంకా కొత్తగా కనెక్షన్లు ఇవ్వాలన్నా సిద్ధంగా ఉన్నాం. నీటి సరఫరా ట్యాంక్‌ల నుంచి గ్రావిటీ ద్వారా జరుగుతుంది. రెండు ట్యాంక్‌లకు మాత్రమే విద్యుత్‌ను వినియోగిస్తున్నాం. ట్యాంక్‌ల నిర్మాణంతో విద్యుత్ వినియోగం తగ్గింది.

– రంజిత్‌కుమార్, ఈఈ, పబ్లిక్ హెల్త్

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

'ఈ గతేంటి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

రఘునాథపాలెం: మండలంలోని రఘునాథపాలెం–శివాయిగూడెంల మధ్య ఉన్న కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల, శివాయిగూడెం గ్రామాల్లో ఈగల సమస్యతో నరకయాతన పడుతున్న సమస్యలపై శుక్రవారం 'సాక్షి'లో ఈగతేంటి పేరుతో వచ్చిన కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జెడ్పీ సీఈఓ ఇంజం అప్పారావు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం అజయ్‌కుమార్‌లు ఎంపీడీఓ రామకృష్ణ, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌కుమార్‌లతో కలిసి పరిశీలించారు. ఈనేపథ్యాన ఈగల సమస్యపై పాఠశాల ప్రత్యేక అధికారి లతను వివరాలు అడిగి తెలుసుకుని పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పాఠశాలకు సమీపంలో ఉన్న కోళ్ల ఫాం వద్దకు వెళ్లి ఈగల నిర్మూలనకు తగిన మందులు స్ప్రే చేయించేలా చర్యలు తీసుకోవాలని సీఈఓ, జీఎంలు కోళ్ల ఫాం నిర్వాహకులను ఆదేశించారు.



కోళ్ల ఫాం నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఈఓ, పరిశ్రమల శాఖ జీఎం తదితరులు

బస్సు రాక విద్యార్థులకు సెలవు

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు శుక్రవారం అప్రకటిత సెలవు వచ్చింది. ఈ స్కూళ్ల పరిసరాల ప్రాంతాలైన వెలుగుమట్ల గుట్టపై ఉన్న వినోబానగర్‌కాలనీ, రఘునాథపాలెం బైపాస్‌లోని పువ్వాడ అజయ్ నగర్‌ల్లోని విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సు నడిపిస్తున్నారు. అయితే, శుక్రవారం చెప్పాపెట్టకుండా బస్సును రద్దు చేయడంతో 70మంది విద్యార్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. విద్యార్థుల కోసం రెండేళ్లుగా బస్‌పాస్‌లు జారీ చేస్తుండగా ఈసారి ఇంకా పాస్ ఇవ్వకున్నా రానుపోను రూ.20 చెల్లిస్తున్నారు. అయినా శుక్రవారం బస్సు రాకపోవడంతో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మోహన్‌దాస్ ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే, బస్సు ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో పంపించడానికి వీలు పడలేదని చెప్పినట్లు తెలిసింది. ఇదే విషయమై 'సాక్షి'ఆర్టీసీ ఉద్యోగి రామయ్యతో మాట్లాడగా విద్యార్థులను తీసుకొచ్చే సర్వీస్‌ను ఇంకో రూట్‌కు కేటాయించామని చెప్పడం గమనార్హం.

జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: పీవైఎల్ రాష్ట్ర 8వ మహాసభలు వచ్చే నెల 4,5 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరి సాగర్ తెలిపారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సంఘ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ మహాసభల్లో యువత, నిరుద్యోగులపై చర్చలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోల లక్ష్మీనారాయణ, సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉమాశంకర్, గొర్రెపాటి రమేష్, ఉపేందర్, గడ్డం వెంకన్న, గుడిచుట్టు గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ దళపతి ఎల్లన్న..

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాపంథా ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేస్తున్న విచ్ఛిన్న శక్తుల ఆగడాలను నిలువరించేందుకు వెళ్లి పోలీస్ ఎన్‌కౌంటర్‌లో చంద్ర కృష్ణమూర్తి (ఎల్లన్న) అమరుడయ్యాడని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు సీవై.పుల్లయ్య అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఎల్లన్న వర్ధంతి సందర్భంగా ఎల్లన్న చిత్రపటానికి ప్రజాపంథా నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర సహాయ కార్యదర్శి డి.చందు, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బి.వెంకటేష్, జిల్లా నాయకులు కరుణ్, గణేష్, రాకేష్, శారద, లింగన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు పరకాల నాగరన్న, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరు సాగర్‌లు ఎల్లన్న చిత్రపటానికి నివాళులర్పించారు.

పెద్దమ్మతల్లికి బోనాలు..

రఘునాథపాలెం: వానలు కురవాలని.. పంటలు పుష్కలంగా పండాలని కోరుతూ మండలంలోని వేపకుంట్ల గ్రామ మహిళలు పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. శుక్రవారం గ్రామానికి చెందిన మహిళలంతా కలిసి బోనాలను నెత్తిని పెట్టుకొని ఊరేగింపుగా తల్లి గుడికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు రమాదేవి, సుజాత, రేణుక, ముత్తమ్మ, మానస, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళి

ఖమ్మంమామిళ్లగూడెం: ఒకే ప్రజా, ఒకే చట్టం కావాలని కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేసి అరెస్ట్ అయి జైల్‌లోనే ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు జన్‌సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం బలిదాన్ దివాస్ సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ నాయకులు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ భావాలు, దేశ భక్తితో కూడిన ఒక పార్టీ దేశానికి అవసరమని భావించి శ్యామ్ ప్రసాద్ జన్‌సంగ్ పార్టీ స్థాపించారని తెలుపుతూ ఆయన సేవలను నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, భద్రం, వన్‌టౌన్ ప్రధాన కార్యదర్శి డీకొండ శ్యామ్, అర్బన్ ఉపాధ్యక్షుడు గజ్జల శ్రీనివాస్, కార్యాలయ ఇన్‌చార్జ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



రోటరీనగర్ పాఠశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఖమ్మంఅర్బన్/ఖమ్మంమయూరిసెంటర్: రానున్న శాసనసభ ఎన్నికల నిర్వహణకు నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలను అర్బన్ తహసీల్దార్ మేదరమేట్ల శైలజ శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు నగరంలోని రోటరీనగర్ ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించి వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈనేపథ్యాన ఉన్నత పాఠశాలలో నాలుగు, ప్రాథమిక పాఠశాలలో మూడు కేంద్రాలను గుర్తించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోతుకూరి మధు విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను వివరించారు. తహసీల్దార్ వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు ఉన్నారు. అలాగే నగరంలోని నగరంలో పోలింగ్ కేంద్రాల లోకేషన్లను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి తెలుసుకుని ఆయా కేంద్రాలకు వెళ్లి బూత్‌లు, వాటిల్లో గల సౌకర్యాలను పరిశీలించారు. కమిషనర్ వెంట ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం



కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాస్, తదితరులు

తిరుమలాయపాలెం: ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్‌లో నిధులు తక్కువ కేటాయించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఎర్ర శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మండల కార్యాలయాల ఎదుట ఈ నెల 26న నిర్వహించే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు షేక్ బషీరుద్దీన్, కేవీపీఎస్ జిల్లా నాయకులు కొమ్ము శ్రీను, నెర్సుల వెంకటేష్, కొమ్ము వెంకన్న, రాములు, సురేష్, ప్రసాద్, ఉపేందర్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం..

నేలకొండపల్లి: ప్రజా వ్యతిరేక విధానాలపై క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తామని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూక హనుమంతరావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శుక్రవారం నేలకొండపల్లిలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్, బీజేపీలు ప్రజాసమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నాయని ఆరోపించారు. టీడీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. రైతులకు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించాలని, బీసీలకు రూ.1లక్ష రుణం అన్ని వర్గాల వారికి అందించాలని, బీసీ బంధు ప్రకటించాలని డిమాండ్ చేశారు. నేలకొండపల్లి మాజీ ఎంపీపీ తీగ వెంకటేశ్వర్లు, కోలేటి మస్తాన్, గుండు శ్రీనివాసరావు, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తెల్దారుపల్లి విద్యార్థి ప్రతిభ

ఖమ్మంరూరల్: జేఈఈ మెయిన్స్ బీఆర్క్ ఫలితాల్లో ఎస్టీ విభాగంలో మండలంలోని తెల్దారుపల్లికి చెందిన భూక్యా నాగరాజు ఆల్ ఇండియా 1599వ ర్యాంక్ సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ సందర్భంగా నాగరాజును సర్పంచ్ ఎస్.కోటయ్య, గ్రామ పెద్దలు వెంకట్రావు, సంగయ్యలు అభినందించారు.

వినతులు..

డీఈఓకు..

ఖమ్మం సహకారనగర్: పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ అంటూ వ్యాపారం చేస్తున్న నగరంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం డీఈఓ సోమశేఖరశర్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. పర్సంటేజీల తీసుకొని తాము ఎంపిక చేసుకున్న బుక్‌స్టాళ్లలోనే కొనుగోలు చేయాలని చెప్తున్న పాఠశాలలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నాయకులు కరుణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు..



వినతి పత్రం అందిస్తున్న వెంకటేశ్వరరావు

నేలకొండపల్లి: మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, సంఘం పాలేరు డివిజన్ అధ్యక్షుడు మారిశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈమేరకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తహసీల్దార్ దారా ప్రసాద్‌కు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దళితబంధు తరహాలో బీసీ బంధు ప్రకటించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు డేగల నరసింహారావు, ఎ.నాగేశ్వరరావు, చిట్టెంశెట్టి ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అనాథల ఆధ్వర్యాన దీక్ష

ఖమ్మం మామిళ్లగూడెం: అనాథ పిల్లల సంక్షేమం కోసం కేసీఆర్ ఇచ్చిన హామీలు వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ అనాథల దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మంత్రివర్గ ఉప సంఘం చేసిన సిఫారసులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు టి.అంజయ్య, ఈదయ్య, సునిల్, మాచర్ల క్రాంతి, అశోక్, నరసింహారావు, రాము, శ్రీనివాస్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ ప్రకటించాలి

కూసుమంచి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వెంటనే ఏకకాలంలో రుణమాఫీ ప్రకటించాలని సీపీఎం పాలేరు డివిజన్ ఇన్‌చార్జ్ బండి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కూసుమంచిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల రుణమాఫీ నెరవేర్చాలని, గృహలక్ష్మి కింద రూ.3లక్షలకు బదులు రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల ఇన్‌చార్జ్ బుగ్గవీటి సరళ, కార్యదర్శి ఎడవెల్లి రమణారెడ్డి, సభ్యులు శీలం గురుమూర్తి, వెల్లంపల్లి అశోక్, గంగాధర్, కర్ణబాబు, గన్యా నాయక్, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో మాజీ ఎంపీ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో పర్యటించారు. ఖమ్మంలోని మాదగాని దుర్గా సోదరుడు సైదులు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా ఖమ్మం రూరల్ మండలంలోని తాళ్ళేసతండా గ్రామానికి చెందిన మాజీ డీసీసీ అధ్యక్షుడు బానోత్ సోమ్లా నాయక్ అనారోగ్యంతో బాధపడుతున్నందున పరామర్శించి ఓదార్చారు. కూసుమంచి మండలం నాయకన్‌గూడెం గ్రామంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై పట్టువస్త్రాలను కానుకగా అందజేశారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న పొంగులేటి

పొంగులేటి అనుచరుల సన్నాహక సమావేశం..

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేటలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు సన్నహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దినేని స్వర్ణకుమారి మాట్లాడుతూ.. శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిక సందర్భంగా మండలం నుంచి భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎ.అశోక్‌నాయక్, సీహెచ్.శివ రామకృష్ణ, సూదగాని ఉపేందర్, భుజంగరెడ్డి, ఎ.వెంకటరెడ్డి, టి.రాజశేఖర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి చారి, ఎస్.ఉపేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగికి గాయాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్ వైఎస్ఆర్ నగర్ సమీపంలోని రఘునాథపాలెం బైపాస్‌రోడ్డులో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి కొల్లు వీరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ నెల 19న ఘటన జరగగా శుక్రవారం ఖమ్మంఅర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జయనగర్‌కాలనీలో నివాసం ఉండే రిటైర్డ్ ఉద్యోగి వీరయ్య ఈ నెల 19న ద్విచక్రవాహనంపై కలెక్టరేట్ వెళ్తుండగా వేపకుంట్ల రోడ్డు నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో వీరయ్య రోడ్డుపై పడగా తలకు బలమైన గాయాలయ్యాయి. వీరయ్య కుమార్తె శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొలేరో వ్యాన్ బోల్తా..

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై గంగబడంతండా సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున బొలేరో వ్యాన్ బోల్తా కొట్టింది. ఖమ్మం నుంచి సూర్యాపేట వెళ్తున్న ఈ వ్యాన్ బోల్తాకొట్టడంతో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్పగాయాలయ్యాయి. డ్రైవర్ నిద్రమత్తుతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం



షిర్డీ సాయి మందిరంలో పూజలు చేస్తున్న కమిటీ ప్రతినిధులు



శ్రీ కృష్ణ సాయి ఆశ్రమంలో పూజా సామగ్రితో కమిటీ ప్రతినిధులు, భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని గాంధీ చౌక్ వర ప్రధాత షిర్డీ సాయి మందిరంలో 13వ వార్షికోత్సవం, త్రీటౌన్ రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీకృష్ణసాయి ఆశ్రమంలో 23వ గురుపౌర్ణమి వేడుకలను ఆలయ నిర్వాహకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించి బాబా భక్తులకు మాలాధారణ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్లు వములపల్లి వెంకటేశ్వరరావు దంపతులు, లగడపాటి రామారావు, ప్రధాన కార్యదర్శి సిద్దంశెట్టి నాగమణి, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, ఉపాధ్యక్షులు చౌడవరపు మధుసూదన్‌రావు, కె.శ్రీనివాసరావు, కోశాధికారి కె. వెంకటజగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు మోదీ విజయాలు

ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ బీజేపీ శ్రేణులు శుక్రవారం గడపగడపకు తిరిగారు. ఈ సందర్భంగా మోటార్‌సైకిళ్ల ర్యాలీలు నిర్వహించడంతో పాటు మోదీ విజయాలపై ముద్రించిన బ్రోచర్లను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. పేదల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రధాని మోదీ పాలన సాగిస్తున్నారని పలువురు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం మామిళ్లగూడెం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు